29-05-2025
గురువారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 241 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

JB
జయభేరి



జీవితంలో తొలి మెట్టు ఎక్కబోతున్న విద్యార్థినీ విద్యార్థులంతా కష్టపడి చదువుకుని భవిష్యత్తులో మరింతగా రాణించి రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. చదువుకోవడం ద్వారా కుటుంబానికే కాకుండా, సొంత ఊరికి, రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రతిష్టలు తేవొచ్చని ఉద్బోధించారు.

# అక్షరం ఇచ్చే శక్తి అనంతం

**జయభేరి, హైదరాబాద్ :**

బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (TGSWREIS) ఆధ్వర్యంలోని ఎస్సీ గురుకులాల నుంచి ఐఐటీ, ఎన్‌ఐటీల్లాంటి ప్రఖ్యాత సంస్థల ప్రవేశాలతో పాటు వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 10 వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు అవార్డుల బహూకరణ, ఉత్తమ ఫలితాలు సాధించిన గురుకులాలకు ప్రోత్సాహకాలు అందించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తో కలిసి పాల్గొన్న ముఖ్యమంత్రి ముందుగా ప్రాంగణంలో విద్యార్థుల చిత్రకళా గ్యాలరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "అసమానతలు తొలగించి సమసమాజం నిర్మించాలన్న ఆనాటి పోరాటయోధుల స్ఫూర్తితో ప్రభుత్వం పనిచేస్తోంది. గురుకులాల్లో చదువుకుంటున్న మా పిల్లలు రేపటి రోజున ఉన్నత శిఖరాలను అధిరోహించి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని కాంక్షిస్తున్నా. తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాప రెడ్డి పేరును తెలుగు యూనివర్సిటీకి, మహిళా విద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరును, ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును.. ఇలా ఎందరో త్యాగమూర్తుల స్ఫూర్తితోనే సమసమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం పనిచేస్తోంది. జవహర్ లాల్ నెహ్రూ గారి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తున్నాం. ప్రజల కోసం పాటుపడిన వారే చరిత్రలో నిలిచిపోతారు. ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే చదువు చాలా ముఖ్యం. చదువులో మరో మెట్టు ఎక్కబోతున్న విద్యార్థుల ముందు రకరకాల రంగుల ప్రపంచం ఆకర్షణీయంగా ఉంటుంది. ఊహాగానాల్లో తిరగకుండా జీవితంలో 25 సంవత్సరాలు వచ్చే వరకు కష్టపడి చదువుకుంటే ఈ సమాజంలో గౌరవంగా బతకడానికి, భవిష్యత్తులో రాణించడానికి వీలవుతుంది. దారితప్పితే తల్లిదండ్రులు తలదించుకునే పరిస్థితి వస్తుంది. చదువుకుంటే గ్రామం నుంచి రాష్ట్రం వరకు గర్వంగా బతికేలా చేస్తుంది. వందేళ్ల చరిత్రలో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి తొలిసారి దళితుడిని వీసీగా నియమించాం.

...మిగతాది 2 లో

# సరిహద్దుల్లో సివిల్ మాక్ డ్రిల్



**జయభేరి, న్యూఢిల్లీ, మే 28:**

కాల్పుల విరమణ అనంతరం భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు అదుపులోకి వచ్చాయి. కానీ పాక్ కుయుక్తులను తిప్పి కొట్టేందుకు భారత్ రెడీగా ఉంది. ఇటీవల ఓసారి సివిల్ మాక్ డ్రిల్ సైతం చేపట్టి పౌరులకు అవగాహనా కల్పించింది కేంద్రం. మరోసారి సివిల్ మాక్ డ్రిల్ చేపట్టాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇటీవల చేపట్టినట్లు దేశ వ్యాప్తంగా కాకుండా కేవలం పాకిస్తాన్ తో సరిహద్దు పంచుకుంటున్న 4 రాష్ట్రాల్లో మాక్ డ్రిల్ చేపట్టనున్నారు. మాక్ డ్రిల్ సమయంలో కరెంట్ సరఫరా నిలిపివేస్తారు. మే 29న (నేడు) జమ్మూ కాశ్మీర్‌ల, గుజరాత్, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల్లో సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. పాకిస్తాన్ సరిహద్దులో ఉన్న నాలుగు రాష్ట్రాల్లో గురువారం సాయంత్రం సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. ఇటీవల పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతీకారం తీర్చుకోవడానికి ముందు భారత్‌లో దేశ

...మిగతాది 2 లో

# తాతకు నివాళి అర్పించిన జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్‌రామ్



**జయభేరి, హైదరాబాద్, మే 28:**

విశ్వవిఖ్యాత నట సార్వభౌమ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి నేడు. ఆయన కుటుంబసభ్యులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్నారు. నేడు ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని సినీ నటులు జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్‌రామ్ హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద తాతకు నివాళులు అర్పించారు. పుష్పగుచ్ఛాన్ని ఉంచి, నమస్కరించి ఎన్టీఆర్‌కు వీరిద్దరూ నివాళి అర్పించారు. ఘాట్ వద్ద కాసేపు కూర్చుని తాతతో

...మిగతాది 2 లో

# తల్లికి వందనం ఉచిత బస్సుపై గుడ్ న్యూస్




**జయభేరి, కడప,మే 28:**

2029 ఎన్నికల్లో 2024 కంటే ఎక్కువ మెజార్టీతో టీడీపీ అభ్యర్థుల్ని గెలిపించాలని ఏపీ సీఎం చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సంక్షేమ కార్యక్రమాలకు ఆద్యుడు టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అన్నారు. ప్రతి సందర్భంలోనూ వెనుకబడిన వర్గాల వారికి మెరుగైన అవకాశాలు ఇవ్వాలి. వారి అభివృద్ధి కోసం టీడీపీ పాటుపడుతోంది. జనాభా దామాషా ప్రకారం అన్ని వర్గాలకు ప్రయోజనాలు చేకూరాలి. బడుగు, బలహీనవర్గాల వారికి అండగా నిలవాలి. వెనుకబడిన వర్గాల వారి కోసం అంబేద్కర్ స్ఫూర్తిని కొనసాగించిన నేత ఎన్టీఆర్. వెనుకబడిన వర్గాల నేతలైన జీఎంసీ బాలయోగిని లోక్‌సభ స్పీకర్, ప్రతిభా భారతిని అసెంబ్లీ స్పీకర్ చేశాం. సామాజిక న్యాయం చేసి చూపించిన పార్టీ తెలుగుదేశం. మాల, మాదిగ వర్గీకరణ కోసం చర్యలు చేపట్టిన పార్టీ మనది. సుప్రీంకోర్టుకు వెళ్లి సామాజిక న్యాయం కోసం పోరాటం చేశాం. 1996లో చేసిన వర్గీకరణను 2025లోనూ పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం. వచ్చే నెలలో తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలుంటే అంత మందికి రూ.15 వేలు ఇస్తాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సులో ప్రయాణం కల్పిస్తాం. ఇప్పటికే దీపం కింద 3 ఉచిత

...మిగతాది 2 లో




# మేడిగడ్డపై ఎన్ఎస్‌డీఏ రిపోర్ట్ అంతా బూటకమే

**జయభేరి, హైదరాబాద్, మే 28:**

మేడిగడ్డ బ్యారేజీపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన నివేదిక అంతా బూటకమని బీఆర్ఎస్ చెబుతున్న మాటే అక్షరాలా నిజమని తేలిపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రాజెక్టుపై కనీస పరీక్షలు నిర్వహించకుండా ఎన్డీఎస్ఏ తుది రిపోర్టు ఎలా ఇస్తుందని ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ ప్రశ్నించడంతో ఈ నివేదిక తప్పులతడక అని రుజువైపోయింది అన్నారు. అశాస్త్రీయ నివేదికలతో బీఆర్ఎస్ నేతలపై బురదజల్లే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ ఎక్స్ వేదికగా ఆరోపించారు. మేడిగడ్డపై ఇచ్చిన నివేదిక ఎన్ఎస్‌డీఏ నివేదిక కాదని, ఎన్డీయే నివేదిక అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.'క్షేత్రస్థాయిలో కనీస పరీక్షలు చేయకుండానే NDSA ఇచ్చిన నివేదికను ఎల్ అండ్ టీ సంస్థ తిరస్కరించడం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పూర్తిగా చెంపపెట్టు లాంటిదే. గతంలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ గంటల వ్యవధిలో ఇచ్చిన ప్రాథమిక నివేదిక నుంచి, ఏడాదిన్నర దాకా సాగదీసిన తరువాత ఇటీవల సైతం

...మిగతాది 2 లో

# వెల్ఫేర్ హాస్టళ్లలో దారుణమైన పరిస్థితులు



**జయభేరి, హైదరాబాద్, మే 28:**

రాష్ట్రంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో దారుణమైన పరిస్థితులు ఉన్నాయని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. ఇందుకు సంబంధించి ఓ ఆడియోను విడుదల చేశారు. శానిటేషన్ వర్కర్స్‌ను తొలగించి ఆ పనులను విద్యార్థులతో చేయించటం నేరమన్నారు. బాధ్యత లేకుండా మాట్లాడిన ఐఏఎస్ ను తొలగించాలని డిమాండ్ చేశారు.

...మిగతాది 2 లో

## కంపెనీలు కన్నడ ఎందుకు వీడుతున్నాయి...

2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## చదువు చాలా ముఖ్యం

ఆ కోవలోనే సార్వత్రిక విశ్వవిద్యాలయానికి, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీకి, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా, విద్యా కమిషన్ చైర్మన్‌గా, రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా, రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా గతంలో ఎప్పుడూ లేని విధంగా దళిత బిడ్డలు ఈ పదవులు చేపట్టారంటే వారికి కేవలం కులంతోనే అవకాశాలు రాలేదు. వారు ఉన్నత స్థాయిలో చదువుకుంటే వచ్చాయి. దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలు ఆత్మన్యూనతా భావాన్ని వీడాలి. ఆ లక్ష్యంతోనే రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నాం. ఇక్కడున్న గురుకుల పిల్లల్లో ప్రతిభ ఉంది. ఆత్మవిశ్వాసం ఉంది. భవిష్యత్తులో కచ్చితంగా రాణించగలుగుతారన్న నమ్మకం నాకుంది. కుటుంబానికే కాకుండా గ్రామానికి, దేశానికి పేరుప్రతిష్టలు తీసుకొస్తారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉన్నదని సంపూర్ణంగా విశ్వసించే వాడిని. కష్టపడి చదివితే రాణిస్తారు. మీరు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. మీ భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని కోరుకుంటున్నా. మీకెప్పుడూ తోడుగా ఉంటా. భవిష్యత్తులో రాణించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నా..." అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్రు, సలహాదారులు వేం నరేందర్ రెడ్డి , షబ్బీర్ అలీ , పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.

## సరిహద్దుల్లో సివిల్ మాక్ డ్రిల్

వ్యాప్తంగా పలు నగరాల్లో, ఏపీలోని విశాఖపట్నంలో, తెలంగాణలోని హైదరాబాద్‌లోనూ సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించారు. పాక్ సైన్యం దాడులు ఓ వైపు, ఉగ్రవాదుల కుట్రలు మరోవైపు భారత్‌కు ప్రమాదంగా మారుతున్నాయి. దాంతో ప్రజలను ఎప్పటికప్పుడూ సైన్యం చేస్తున్న సన్నద్ధత, పౌరులకు అవగాహన కల్పించడం కోసం పాక్ తో సరిహద్దు పంచుకుంటున్న రాష్ట్రాల్లో మే 29న సాయంత్రం మాక్ డ్రిల్ చేపడతారు.

ఏప్రిల్ 22న జమ్మూకాశ్మీర్ లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో ఓ నేపాలీ సహా 26 మంది అయామకులు ప్రాణాలు కోల్పోయారు. దీనికి ప్రతీకారణంగా భారత్ ఆపరేషన్ సిందూర్ కు శ్రీకారం చుట్టింది. అంతా ప్లాన్ చేసుకుని మే 6, 7 తేదీలో రాత్రి భారత్ పాకిస్తాన్‌పై 'ఆపరేషన్ సిందూర్' ప్రారంభించింది. పాకిస్తాన్, పీఓకేలోని 9 ఉగ్రవాద శిబిరాలను భారత బలగాలు ధ్వంసం చేశాయి. దానికి ముందే దేశంలోని 244 జిల్లాల్లో సివిల్ మాక్ డ్రిల్స్ జరిగాయి. వీటిలో చాలా వరకు యుద్ధ సమయంలో ఎలా స్పందించాలో, ముప్పునకు గురయ్యే పరిస్థితుల్లో ఎలా బయటపడాలో పౌరులకు అవగాహన కల్పించారు.శత్రు దాడుల సమయంలో, ఇతర అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు పౌరులను సంసిద్ధం చేయడం. వారికి అవగాహనా కల్పించడంతో పాటు అత్యవసర సమయంలో స్పందించాల్సిన పద్ధతులపై అలర్ట్ చేయడం ఈ సివిల్ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశం. ఆ సమయంలో ఎయిర్ సైరన్‌ల మోత వినిపిస్తుంది, స్థానిక అత్యవసర సేవలు, సమన్వయంతో స్పందించడం వంటివి ఉంటాయి. 1971లో సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించారు. కానీ 1999లో కీలకమైన కార్గిల్ యుద్ధం సమయంలో పౌర రక్షణ డ్రిల్స్ నిర్వహించలేదు. ఇటీవల మే 7వ తేదీన సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించి పౌరులకు వీటిపై అవగాహనా కల్పించడంతో పాటు యుద్ధ వాతావరణం సమయంలో పాటించాల్సినవి తెలిసేలా చేశారు. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని, ఇది అంతం కాదు ఆరంభం మాత్రమే అని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

## తాతకు నివాళి అర్పించిన జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్‌రామ్

తమ మెమరీస్ నెమరు వేసుకున్నారు. సినిమా రంగానికి ,తెలుగు ప్రజలకు ఎన్టీఆర్ చేసిన సేవలను వీరు గుర్తుచేసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి ఎన్టీఆర్, కళ్యాణ్‌రామ్ వెళ్లిపోయారు.సాధారణ ఉద్యోగి స్థాయి నుంచి నెంబర్ వన్ హీరోగా, ఆపై జనం గుండెల్లో చెరగని ముద్రవేసిన ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన వ్యక్తి ఎన్టీఆర్. తెలుగు సినిమా ఖ్యాతిని, తెలుగు వాడి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన రూపం ఎన్టీఆర్. నేడు ఆయన 102వ శత జయంతి వేడుకలను నందమూరి కుటుంబసభ్యులు సెలబ్రేట్ చేసుకుంటున్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ఎన్టీఆర్ ఫ్యాన్స్, తెలుగు వారు ఎన్టీఆర్ జయంతి వేడుకలు జరుపుకుంటున్నారు. సినిమా రంగానికి, రాజకీయాల్లోకి దిగి తెలుగు ప్రజలకు విశేష సేవ చేసి అన్నగా పిలుచుకునే ఎన్టీఆర్ సేవల్ని గుర్తుచేసుకుంటున్నారు. కొన్నేళ్లుగా ప్రతి ఏడాది జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్ రామ్ కలిసి ఎన్టీఆర్ ఘాట్ వద్దకు వెళ్తున్నారు. అక్కడ తాత ఎన్టీఆర్‌కు నివాళి అర్పించి, ఆయన సేవలను గుర్తుచేసుకుని ఎమోషనల్ అవడం చూస్తున్నాం. ఈ ఏడాది సైతం బుధవారం ఉదయం తారక్, కళ్యాణ్ రామ్ ఎన్టీఆర్ ఘాట్ వద్దకు వెళ్లి తాతకు నివాళులర్పించారు. వీరిద్దరు వస్తున్నారని ఘాట్ వద్ద పోలీసులు భద్రత కట్టుదిట్టం చేశారు.

## ఎన్ఎస్‌డీఏ రిపోర్ట్ అంతా బూటకమే


ఎన్ఎస్‌డీఏ ఇచ్చిన తుది నివేదిక వరకూ రెండింటిలోనూ అడుగడుగునా వ్యత్యాసాలు ఉన్నాయని, పొంతనలేని అంశాలు ఆ రిపోర్టు డొల్లతనాన్ని బయటపెట్టింది. ఈ విధంగా పనికిరాని రిపోర్టును పట్టుకుని ఎన్డీఎస్ఏ నివేదికనే తమకు ప్రామాణికమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్రప్రభుత్వం చెప్పడం వారి అసమర్థతకు, చేతకానితనానికి నిదర్శనం. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కి పేరొస్తుందని.. రాజకీయ కక్షతోనే ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన కాళేశ్వరం ను పక్కనపెట్టి సీఎం రేవంత్ రెడ్డి పాపం చేశారు. ఇప్పటికే సీఎం రేవంత్ నిర్వాకం వల్ల ఏడాదిన్నరగా తెలంగాణలో లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. దాంతో 500 మందికి పైగా అన్నదాతలు ఆత్మహత్య చేసుకున్నారు. పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ కొట్టుకుపోయినా వేగంగా పునరుద్ధరించిన విషయం మరిచిపోయారు. మేడిగడ్డ విషయంలో మాత్రం 18 నెలలుగా మొత్తం ప్రాజెక్టునే కోల్డ్ స్టోరేజీలోకి నెట్టడం దుర్మార్గం. గత అసెంబ్లీ ఎన్నికల వేళ బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురద జల్లేందుకు బీజేపీ, కాంగ్రెస్ కుట్రలు చేశాయి. అదే విధంగా ఇటీవల జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభను దెబ్బతీయాలని మేడిగడ్డ బ్యారేజీ తుది నివేదిక పేరిట కొత్త డ్రామాకు తెరతీశారు. ప్రాజెక్టు ప్లాన్ నుంచి నిర్మాణ నాణ్యత వరకూ అడుగడుగునా ఎక్కడా రాజీ పడకుండా కట్టిన ప్రాజెక్టు కాళేశ్వరం. ఇకనైనా మేడిగడ్డ బ్యారేజీపై బురదజల్లడం మాని, ఎల్ అండ్ టీ అభ్యంతరాలకు తెలంగాణ ప్రభుత్వంగానీ, ఎన్డీఎస్ఏ సమాధానం చెప్పాలని' కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో మేడిగడ్డ కుంగుబాటు అంశం బయటకు రావడంతో బీఆర్ఎస్ పార్టీకి ఎన్నికల్లో ప్రతికూలంగా మారిందని ఆ పార్టీ నేతలు పలుమార్లు చెప్పారు. సరైన నివేదిక కాదని కేటీఆర్ మరోసారి ఆరోపించారు.

## తల్లికి వందనం.. ఉచిత బస్సుపై..

గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. డ్వాక్రా సంఘాలతో మహిళా సాధికారత వస్తుంది. మహిళలు రాజకీయంగా, ఆర్థిక, సామాజికంగా మగవారితో సమానంగా ఉండాలన్నేనా సంకల్పం. పురుషులు ఈ విషయంలో సహకరించాలి. ఆడబిడ్డలు బాగుంటే అక్కడ మనకు మంచి జరుగుతుంది. 50 రూపాయలకే కరెంట్ ఇచ్చాం. తాగునీటి, సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చాం. పామాయిల్ సాగు తీసుకొచ్చాం. రాయలసీమను సస్యశ్యామలం చేసిన పార్టీ టీడీపీ. ఉత్తరాంధ్ర ఏజెన్సీ ఏరియాలో అరకు కాఫీ ప్రపంచంలోనే బ్రాండ్ గా మారుతోంది. రాయలసీమలో హార్టికల్చర్, కోస్తాంధ్రంలో వాణిజ్య పంటలకు సహకారం అందిస్తాం. పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేస్తాం. రైతులకు మూడు విడతల్లో వారికి ఆర్థిక సాయం అందించడంతో పాటు గిట్టుబాటు ధర కల్పిస్తాం. గతంలో జనాభా నియంత్రణకు మొగ్గుచూపాం. ఇప్పుడు జనాభా ప్రమోషన్ కోసం చర్యలు చేపట్టాం. యువత తగ్గిపోతే చాలా సమస్యలు వస్తాయి. కేంద్ర, రాష్ట్రప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఏపీ ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన పీ4 (ప్రైవేట్ పబ్లిక్ పీపుల్ పార్ట్‌నర్‌షిప్) విధానం పేదలకు వరం లాంటిది. పీ4తో పేదరికాన్ని నిర్మూలించే చర్యలు చేపట్టాం. ఆస్తిలో మహిళలకు హక్కు ఇచ్చింటి ఎన్టీఆర్, ఆ తరువాత డ్వాక్రా మహిళల వ్యవస్థ తీసుకొచ్చాను. ఉద్యోగాలు, కాలేజీ సీట్లలో వారికి అవకాశాలు పెంచాం. ఆడబిడ్డలపై ఎవరైనా అఘాయిత్యాలకు పాల్పడితే వారికి అదే రోజు చివరిరోజు అవుతుంది. 22 మంది మహిళలకు ఎమ్మెల్యే సీట్లు ఇస్తే 20 మంది గెలిచారు. డ్వాక్రా సంఘాల మహిళలను లక్షాధికారులు కడపలో మాధవిరెడ్డిని అంతా తక్కువ అంచనా వేశారు. రిజల్ట్ చూస్తే ఆమె అదరగొట్టింది. మహిళా శక్తి అంటే అదే' అన్నారు చంద్రబాబు. నన్ను అక్రమ కేసుల్లో జైల్లో పెట్టిన సమయంలో ప్రపంచ వ్యాప్తంగా 100 దేశాల్లో 52, 53 రోజులు పోరాటం చేశారు. నా మీద వారికున్న అభిమానం అలాంటిది' అన్నారు.

# కంపెనీలు కన్నడ ఎందుకు వీడుతున్నాయి...

బెంగళూరు బహుసాంస్కృతిక, బహుభాషా నగరంగా పేరొందినప్పటికీ, ఇటీవలి కాలంలో కన్నడ భాషకు ప్రాధాన్యత ఇవ్వాలనే డిమాండ్ పెరుగుతోంది. బెంగళూరు, భారతదేశ టెక్ రాజధానిగా పేరొందిన నగరం. ఇటీవలి కాలంలో భాషా సంబంధిత వివాదాలతో వార్తల్లో నిలుస్తోంది. గత వేసవిలో నీటి సమస్య బెంగళూరును వేధించింది.



ఈ వేసవిలో వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఈక్వల్ లైఫ్ అనే సంస్థ తమ కార్యాలయాన్ని బెంగళూరు నుంచి పుణేకు తరలించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం బెంగళూరు యొక్కవాణిజ్య వాతావరణంపై, ముఖ్యంగా టెక్ రంగంపై, గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంది.బెంగళూరు బహుసాంస్కృతిక, బహుభాషా నగరంగా పేరొందినప్పటికీ, ఇటీవలి కాలంలో కన్నడ భాషకు ప్రాధాన్యత ఇవ్వాలనే డిమాండ్ పెరుగుతోంది.

ఒకప్పుడు మహారాష్ట్రలో మరాఠీ ఉద్యమాల తరహాలో బెంగళూరులో కన్నడ ఉద్యమాలు తీవ్రమవుతున్నాయి. స్థానిక కన్నడిగులు తమ భాష, సంస్కృతిని కాపాడుకోవాలనే ఉద్దేశంతో ఈ ఉద్యమాలు చేపడుతున్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో ఇవి ఘర్షణలకు దారితీస్తున్నాయి. బహుళజాతి సంస్థలు, స్టార్టప్‌లు, ఇతర వ్యాపారాలు బెంగళూరులో విస్తృతంగా ఉన్నాయి, వీటిలో ఉద్యోగులు దేశవ్యాప్తంగా వివిధ భాషా నేపథ్యాల నుంచి వస్తుంటారు. కన్నడ భాషను తప్పనిసరిగా ఉపయోగించాలనే ఒత్తిడి, ముఖ్యంగా బహిరంగ సైన్‌బోర్డులు, కార్యాలయ సమాచారంలో, కొంతమంది ఉద్యోగులకు, సంస్థలకు అసౌకర్యంగా మారింది.

ఈక్వల్ లైఫ్ సంస్థ అధినేత కౌశిక్ ముఖర్జీ ఈ భాషా గొడవలు తమ సిబ్బందిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని స్పష్టం చేశారు.ఈక్వల్ లైఫ్ సంస్థ బెంగళూరు నుంచి పుణేకు తమ కార్యాలయాన్ని తరలించాలని నిర్ణయించడం ఒక ముఖ్యమైన అడుగు. కౌశిక్ ముఖర్జీ తన ఎక్స్ పోస్ట్‌లో, 'వచ్చే ఆరు నెలల్లో మా కార్యాలయాన్ని పుణేకు షిఫ్ట్ చేస్తాం. మా సిబ్బందిని ఈ భాషా సంబంధిత గొడవల బాధితులుగా మారనివ్వం,' అని పేర్కొన్నారు.

ఈ నిర్ణయం వెనుక ఉన్న కారణాలను పరిశీలిస్తే, సంస్థలు తమ ఉద్యోగుల మానసిక శాంతి, ఉత్పాదకత, వ్యాపార స్థిరత్వాన్ని కాపాడుకోవడానికి ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటున్నాయి. పుణే, బెంగళూరుతో పోలిస్తే, టెక్ హబ్‌గా ఉద్భవిస్తూ, సాపేక్షంగా తక్కువ భాషా సంబంధిత వివాదాలతో వ్యాపార స్నేహపూర్వక వాతావరణాన్ని అందిస్తోంది.

పుణే, మహారాష్ట్రలోని మరో ముఖ్యమైన టెక్ కేంద్రం, ఇటీవలి సంవత్సరాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోంది. బెంగళూరుతో పోలిస్తే, పుణేలో భాషా సంబంధిత ఒత్తిడి తక్కువగా ఉంది, ఎందుకంటే ఈ నగరం బహుభాషా, బహుసాంస్కృతిక వాతావరణానికి పెట్టింది పేరు. అదనంగా, పుణేలోని హిన్జవాడి, బంజర్, ఖరడి వంటి ప్రాంతాలు టెక్ పార్కులు, స్టార్టప్‌లకు అనువైన మౌలిక సదుపాయాలను అందిస్తున్నాయి. తక్కువ ఖర్చుతో కూడిన జీవన వ్యయం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యత, మెరుగైన కనెక్టివిటీ పుణేను కంపెనీలకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మార్చాయి. ఈక్వల్

**పుణే, బెంగళూరుతో పోలిస్తే, టెక్ హబ్‌గా ఉద్భవిస్తూ, సాపేక్షంగా తక్కువ భాషా సంబంధిత వివాదాలతో వ్యాపార స్నేహపూర్వక వాతావరణాన్ని అందిస్తోంది.పుణే, మహారాష్ట్రలోని మరో ముఖ్యమైన టెక్ కేంద్రం, ఇటీవలి సంవత్సరాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోంది. బెంగళూరుతో పోలిస్తే, పుణేలో భాషా సంబంధిత ఒత్తిడి తక్కువగా ఉంది, ఎందుకంటే ఈ నగరం బహుభాషా, బహుసాంస్కృతిక వాతావరణానికి పెట్టింది పేరు.**

లైఫ్ ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని పుణేను ఎంచుకున్నట్లు తెలుస్తోంది.ఈక్వల్ లైఫ్ లాంటి సంస్థలు బెంగళూరును వీడడం దీర్ఘకాలంలో నగర ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపవచ్చు. బెంగళూరు భారతదేశ ఐటీ రంగంలో సుమారు 40% వాటాను కలిగి ఉంది. అనేక బహుళజాతి సంస్థలు, స్టార్టప్‌లకు గమ్యస్థానంగా ఉంది. భాషా వివాదాలు ఇలాంటి సంస్థలు నగరాన్ని వీడేందుకు దారితీస్తే, ఇది ఉపాధి అవకాశాలు, పెట్టుబడులు, ఆర్థిక వృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. ఇప్పటికే కొన్ని ఇతర సంస్థలు కూడా ఇదే బాటలో పుణే, హైదరాబాద్, లేదా చెన్నై వంటి నగరాలకు షిఫ్ట్ అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ పరిణామం బెంగళూరుకు ఉన్న 'సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా' హోదాకు సవాలుగా మారవచ్చు.బెంగళూరులో భాషా వివాదాలు కేవలం సామాజిక సమస్యలకు మాత్రమే పరిమితం కాదు.. ఇవి రాజకీయ కోణాన్ని కూడా కలిగి ఉన్నాయి.

స్థానిక భాష, సంస్కృతిని కాపాడాలనే డిమాండ్లు స్థానిక రాజకీయ పార్టీలు, సంస్థల నుంచి బలంగా వినిపిస్తున్నాయి. అయితే, ఈ డిమాండ్లు అతిగా మారినప్పుడు, అవి బహుసాంస్కృతిక నగరం స్వభావాన్ని దెబ్బతీస్తాయి. కర్ణాటక ప్రభుత్వం ఇటీవల కన్నడ భాషకు ప్రాధాన్యత ఇవ్వాలని చట్టాలు తీసుకువచ్చినప్పటికీ, వీటిని అమలు చేసే విధానంలో సమతుల్యత కీలకం. ఈ వివాదాలు కంపెనీల నిర్ణయాలపై ప్రభావం చూపుతున్నాయని ఈక్వల్ లైఫ్ ఉదాహరణ స్పష్టం చేస్తోంది.

# వెల్ఫేర్ హాస్టళ్లలో దారుణమైన పరిస్థితులు



▶▶ మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలల్లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. ఇందుకు సంబంధించిన ఓ ఆడియో క్లిప్ ను విడుదల చేశారు. శానిటేషన్ వర్కర్స్ ను తొలగించి ఆ పనులను పిల్లలతో రెగ్యులర్ గా చేయించడం నేరమన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను కవిత ఓ ప్రకటన ద్వారా ప్రకటించారు.బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వెల్లడించిన వివరాల ప్రకారం.... స్వీపింగ్ మరియు శానిటేషన్ కోసం ఒక్కో గురుకుల పాఠశాలకు ప్రతి నెల బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 40,000 కేటాయించింది. నలుగురు తాత్కాలిక ఉద్యోగులు పనిచేసేవారు.

వీరు టాయిలెట్లు, తరగతి గదులు శుభ్రం చేసేవారు. గత సంవత్సరం ఆగస్టు నెల నుంచి ఈ పద్ధతిని కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించింది. పిల్లలే టాయిలెట్లు, గదులు మాత్రమే కాకుండా పాఠశాల హాస్టల్ ఆవరణలోని బయటి పనులు అన్ని కూడా విద్యార్థులే రెగ్యులర్ గా చేసుకోవాలని అధికారులు చెప్పారు. ఇలాంటి పరిస్థితులు కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సోషల్ వెల్ఫేర్ గురుకుల నెలకొని ఉంది" అని కవిత విమర్శించారు."రాష్ట్రంలోని 240 గురుకుల విద్యా సంస్థలలో అసిస్టెంట్ కేర్ టేకర్ లను తొలగించి వారు చేసే వార్డెన్ పనులను పిల్లలతో చేయించాలని చెప్తున్నారు. ఇప్పటి వరకు వార్డెన్లే అన్ని రకాల నిర్వహణలు చూసుకున్నా... పిల్లలు కమిటీగా ఏర్పడి క్వాలిటీ చెక్ చేసుకునేవారు. కానీ ఇకపై పిల్లలే వంటశాల నిర్వహణ మరియు మెస్ పనులు కూడా చేయాల్సి వస్తుంది. శ్రమను గౌరవించడం, నేర్పడం వేరు... విద్యార్థులతో వెట్టిచాకిరి చేయించడం వేరు. అసలు మొత్తంగా శానిటేషన్ వర్కర్స్ ను తొలగించి ఆ పనులు పిల్లలతో రెగ్యులర్ గా చేయించడం నేరం" అని కవిత తన పోస్టులో ప్రస్తావించారు.

**ఒక ఐఏఎస్ ఇలా అనడం దుర్మార్గం - కవిత**

"ఇక్కడ ఆడియోలో వర్షిని(ఎస్సీ గురుకులాల కార్యదర్శి) గారు చెప్పిన దాంట్లోనే సమాధానం ఉంది. బోర్డు తుడవడం... టాయిలెట్ కడగడం ఒకటి కాదు. మేడం గారి పిల్లలు చదువుకునే చోట అందరూ వాడే టాయిలెట్లను వీరు క్లీన్ చేయగలరా..? అది కూడా రెగ్యులర్ గా...? సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్ లో చదివే పిల్లలు ఏమైనా పాష్ బ్యాక్ గ్రౌండ్ నుంచి వచ్చారా? వెళ్లి కూర్చోగానే టేబుల్ పైకి ఫుడ్ రాదు అనడమేంటి..? ఎందుకు ఇలాంటి పనులు చేయరు..? చేయాల్సిందే అని ఒక ఐఏఎస్ అనడం దుర్మార్గం. ఈ వివక్షల నుంచి తప్పించడానికే కదా ఈ పిల్లలకు సాంఘిక సంక్షేమ హాస్టల్స్ ఏర్పాటు చేయించి చదివించేది. ఇది డిగ్నిటీ ఆఫ్ లేబర్ నేర్పడం కాదు. కుల వివక్ష మరియు శ్రమ దోపిడీ మాత్రమే" అని కవిత దుయ్యబట్టారు.

**ఉద్యోగులను తొలగించటం అన్యాయం - కవిత**

"గతంలో లాగానే పిల్లలు క్వాలిటీ మాత్రమే తనిఖీ చేసుకునే ఏర్పాటు ఉండాలి. అంతే కానీ పిల్లలతో పూర్తిస్థాయి వార్డెన్, శానిటేషన్ వర్కర్స్ చేయించే పని చేయించడం కరెక్ట్ కాదు. నలుగురు శానిటేషన్ వర్కర్స్ ఒక వార్డెన్ మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ గురుకులాలలో కలిపి 1200 మంది ఉద్యోగులను తొలగించడం అన్యాయం. ఒకవైపు ఉద్యోగాలు కల్పిస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పడం మరోవైపు అత్యవసరమైన చోట వారిని తొలగించి ఆ పని భారం విద్యార్థుల మీద ఉంచడం తప్పు" అని కవిత చెప్పారు."అందరూ పిల్లలు సమాజం దృష్టిలో ప్రభుత్వం దృష్టిలో సమానమే అన్న సంకేతాలను పంపాల్సిన గురుకుల పాఠశాలలు వివక్ష కేంద్రాలుగా మారకూడదు. ఎస్సీ వర్గాల పిల్లలు ప్రధానంగా చదివే గురుకుల పాఠశాలలో ఈ నిర్ణయం మానవతావాదులు ముక్తకంఠంతో ఖండించాల్సి ఉంది.

కాంగ్రెస్ ప్రభుత్వ పేదల వ్యతిరేక ఆలోచన విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. తక్షణమే ఆ అధికారిని తప్పించాలి. నెలకు మెయింటెనెన్సు డబ్బులు పాఠశాలలకు ఇవ్వాలి. పిల్లలతో పనిచేయించటం ఆపివేయాలి" అని కవిత డిమాండ్ చేశారు.

# ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేయాలి

**జయభేరి, తుర్కపల్లి, మే 28 :**



జూన్ 6వ తేదీన తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామ పరిధిలో నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం తుర్కపల్లి మండలం వాసాల మర్రి గ్రామంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, జిల్లా అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డిఓ కృష్ణారెడ్డి లతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలలో రాష్ట్రం వెనుకబడిందని, యాదగిరిగుట్ట అభివృద్ధి, ఆలేరు నియోజకవర్గ పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్లు హాజరవుతున్నారని తెలిపారు .తెలంగాణ అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతుందని, మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని సోనియాగాంధీ అందిస్తే గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదాయం గల రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని అన్నారు. నియోజకవర్గం ఎలాంటి అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేయలేదని అన్నారు. గంధ మల్ల ప్రాజెక్టు గత ప్రభుత్వంలో 9.8 టీఎంసీలు అనంతరం 4.8 టీఎంసీలు అని చెప్పి మాటలతోటే కాలం గడిపారని, కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వము అని నిరూపించుకోవడానికి గంధ మల్ల రిజర్వాయర్ను 1.4 టిఎంసీలతో ఆరు నుండి 700 కోట్ల వ్యయంతో నిర్మించే ప్రాజెక్టుతో 12 మండలాలను సస్యశ్యామలం చేయడం కోసం ఆరు తారీఖున ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు. తుర్కపల్లి మండలం తో పాటు చుట్టుపక్కల మండలాల్లో ఎస్సీ, ఎస్టీలు అధికంగా ఉంటారని అందుకోసం 200 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. యాదగిరిగుట్టలో 25 కోట్ల రూపాయలతో వేద పాఠశాలను, కొత్తగా ఏర్పడిన మోటకొండూరు మండలంలో మూడు ప్రభుత్వ భవనాలకు ఎమ్మార్వో, ఎంపీడీవో, పోలీస్ స్టేషన్ భవనాలకు 15 కోట్లతో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కొలనుపాక బ్రిడ్జ్ నిర్మాణానికి 7.5 కోట్లతో, కాల్వపల్లి బ్రిడ్జికి 7.5 కోట్లతో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వం మెడికల్ కాలేజ్ అని చెప్పి ఐదేళ్లు గడిచిన ఇంతవరకు స్థలాన్ని చూడలేదని, నిధులు కేటాయించలేదని కాంగ్రెస్ ప్రభుత్వంలో యాదగిరిగుట్ట ప్రాంతంలో 20 ఎకరాల్లో 170 కోట్లతో మెడికల్ కాలేజ్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. 10 కోట్ల రూపాయలతో గోదాముల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు, నియోజకవర్గంలో సుమారు 1500 కోట్ల రూపాయలతో పలు పనులకు శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు. ఆలేరు అన్ని విధాలుగా అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి సభకు 50 వేల మందితో సభను విజయవంతం చేయాలని అన్నారు. అందుకోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ చాద భాస్కర్ రెడ్డి, నాయకులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



## మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ లక్ష్యం

- రూ.12 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాల చెక్కులను చెన్నారావుపేట మండలం సమాఖ్య సభ్యులకు అందించిన ఎమ్మెల్యే దొంతి
- నెక్కొండ మండల సమాఖ్య సభ్యులకు రూ.15 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల పంపిణీ

**జయభేరి, నర్సంపేట, మే 28:**

నర్సంపేట నియోజకవర్గం చెన్నరావుపేట మహిళా సమాఖ్య సమావేశం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో నిర్వహించగా ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలకు రూ.12 కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును మహిళా సంఘాల బాధ్యులకు అందించారు.అనంతరం నెక్కొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన మండల మహిళా సమాఖ్య మహాజన సభలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతగా భావించి అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.మహిళ సమాఖ్యలకు 90 శాతం సబ్సిడీతో బస్సులను అందించి వాటిని ఆర్టీసీ లో పెట్టించి తద్వారా మహిళ సంఘాలు మరింత బలోపేతం చేస్తున్నామన్నారు.గత కాంగ్రెస్ ప్రభుత్వంతో పావలా వడ్డీతో రుణాలు అందించడం ప్రారంభించి మహిళల ఆర్థికాభివృద్ధికి నాంది పలికిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు.త్వరలో మహిళా సంఘాలచే పెట్రోల్ బంక్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.మహిళలు తీసుకున్న రుణాలతో స్వయం ఉపాధికి ఉపయోగించుకొని ఆర్థికంగా మరింత ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సీఎస్సార్ కోసం 150 కోట్లు

- మలబార్ గ్రూప్ ప్రకటన




**జయభేరి, హైదరాబాద్:**

సామాజిక సేవా కార్యక్రమాల కోసం ఈ ఆర్థిక సంవత్సరం 150 కోట్లు కేటాయించినట్లు మలబార్ గ్రూప్ ప్రకటించింది .హైదరాబాద్ పంజాగుట్ట మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూం వద్ద వరల్డ్ హంగర్ డేను పురస్కరించుకుని 202526 సంవత్సరంలో రెండున్నర కోట్ల మందికి భోజనాలు ఉచితంగా అందించాలని నిర్ణయించింది. గత మూడేళ్ళలో రెండున్న కోట్ల మందికి భోజనాలు అందించామని ...ఈ సీఎస్ఆర్ బడ్జెట్ లో 60 శాతం నిధులను నిరూపేదల ఆకలితీర్చేందుకు ,పేదరిక నిర్మూలన కోసం కేటాయించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు .

## పంట మార్పిడి పద్ధతులను అవలంబించాలి

**జయభేరి, తుర్కపల్లి, మే 28 :**



పంట మార్పిడి పద్ధతులను రైతులు అవలంబించాలని వ్యవసాయ కళాశాల రాజేంద్రనగర్ శాస్త్రవేత్త డాక్టర్ అరుణ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ శాఖ సహకారంతో నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని తుర్కపల్లి మండలం చిన్న లక్ష్మాపురం, కోనాపూర్ గ్రామాల్లో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు కూడా తమ క్షేత్రంలో పచ్చి రొట్టె పెంపకమును వివరిస్తూ జీలుగా, జనుము,పెసర మినుములు చల్లుకోవాలని అన్నారు. తర్వాత 45 రోజులకు సాగు పెట్టి పొలంలో బాగా కలియ దుండడం వలన చాలా మురిగి భూమికి పోషకాలు లభిస్తాయని అన్నారు. రైతులు పంట మార్పిడి పద్ధతులు అవిలబించాలని అలా చేయడం వలన భూసారం పెరిగి చీడపీడలు ఉధృతి తగ్గుతుందన్నారు. నీటి యజమాన్య పద్ధతులు రసాయనిక ఎరువులు వాడటం గురించి వివరించారు. యూరియాలో డి ఏ పి వాడకాన్ని తగ్గించాలని, పెట్టుబడి ఖర్చు తగ్గించాలని అన్నారు. రైతులు విత్తనాలు ఎరువులు కొనుగోలు చేసినప్పుడు రసీదులను భద్రపరుచుకోవాలని కల్తీ విత్తనాల నుండి బయటపడవచ్చు అని అన్నారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిల, డాక్టర్ హిందూధర్ రెడ్డి ,ఏఈఓ లు పృథ్వీరాజ్, రాకేష్, రైతులు బాల నరసింహారెడ్డి, ఆగభూషి, రాజు, , తిరుపతిరెడ్డి, నర్సిరెడ్డి, శీను, జహంగీర్, చంద్రయ్య ,కనకయ్య పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు సాయిబాబా ఆశీస్సులు పొందాలని

**జయభేరి, చింతపల్లి :**



చింతపల్లి షిరిడి సాయిబాబా దేవాలయ వార్షికోత్సవ వేడుకలో నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలమర్చుకోవాలని అని ఆయన అన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ని సన్మానించారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి, దేవరకొండ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు టివియన్ రెడ్డి, పిఏ పల్లి మండల పార్టీ అధ్యక్షులు వల్లపు రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉజ్జిని విద్య సాగర్ రావు, ఎల్లంకి అశోక్, బాదేపల్లి నీరంజన్, వందనపు ఆంజనేయులు, యం.డి. ఖాలేద్, వందనపు ఆంజనేయులు, సిమర్ల శ్రీను యాదవ్, నల్ల శంకర్, ఎర్ర వెంకటయ్య, జక్కుల వెంకటయ్య, తంగేళ్ల శ్రీనివాస్, వెంకట్ రాములు, ధన్ రాజ్, ఆలయ కమిటి ఛైర్మన్ ధనుంజయ, తడకమల్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**జయభేరి, పరవాడ:**



పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలంలో పరవాడ గ్రామంలో మాజీ సీఎం,స్వర్గీయ నందమూరి తారక రామారావు 102వ జయంతి సందర్భంగా మాజీ జడ్పిటిసి సభ్యులు పెందుర్తి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పైల జగన్నాధ రావు ఎన్టీఆర్ విగ్రహనికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు.ఈ యొక్క కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అట్ట సన్యాసి అప్పారావు,పరవాడ మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, పరవాడ మండల తెలుగు యువత అధ్యక్షులు పైల చిన అక్కు నాయుడు,టీడీపీ నాయుకులు పయిల బుజ్జి,పయిల కృష్ణ,గ్రామ టీడీపీ అధ్యక్షుడు వర్రి చంద్రశేఖర్, తాడి మాజీ సర్పంచ్ బొడ్డుపల్లి అప్పారావు,గండి మహేష్,తేలు చలపతి రావు,పయిల సత్యనారాయణ,రమణ మరియు పరవాడ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## సోషల్ మీడియా సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక

**జయభేరి, ములుగు, మే 28 :**

తెలంగాణ రాష్ట్ర సోషల్ మీడియా కమిటీ సమావేశం మెదక్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ క్యాంప్ ఆఫీస్ వద్ద తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నీలం మధు సోషల్ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మన సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రాంతానికి సంబంధించిన కాశబోయిన శేఖర్ ముదిరాజ్ ని నియమించడం జరిగింది. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు మా ప్రియతమ నాయకులు బహుజన ముద్దుబిడ్డ నీలం మధు అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మీడియా సమన్వయకర్తగా ఉన్న సుంకరబోయిన మహేష్ ముదిరాజ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో జిల్లా వ్యాప్తంగా NMR సోషల్ కార్యక్రమాలు జిల్లావ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేస్తామని. సంక్షేమ పథకాలు ప్రజలకు చేరే విధంగా,ఇలా ఈ సోషల్ మీడియా కమిటీ ఉపయోగపడుతుందని తెలిపారు.

## మే 31 తారీకు చలో వరంగల్ విజయవంతం చేయండి




**జయభేరి, ములుగు, మే 28 :**

ములుగు మండలం MRPS మరియు అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిద్దిపేట జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు బుడిగే మహేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఈ నెల 27వ తేదీన ఢిల్లీ లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకొని రైలు మార్గం ద్వారా 31 న ఉదయం 10 గంటలకు వరంగల్ కు చేరుకుంటున్న సందర్భంగా పెద్ద ఎత్తున స్వాగతం పలకడానికి ప్రతి గ్రామం,మండలం, నియోజకవర్గాల నుండి పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు తరలి రావాలని కోరారు. ఈ సమావేశానికి ములుగు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఆదాసు మహేష్ మరియు ములుగు మండల ప్రధాన కార్యదర్శి కొమ్ము వినోద్ కుమార్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## దొడ్డి వెంకటమ్మ మృతి బాధాకరం


- మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణానికి చెందిన లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి లకవరపు మల్లయ్య సోదరి దొడ్డి వెంకటమ్మ మృతి బాధాకరమని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. బుధవారం పట్టణములో జరిగిన దశదిన కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన అన్నారు.ఆమె మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ పిఏ పల్లి మండల అధ్యక్షుడు ఎల్లుగురి వల్లపురెడ్డి,బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేములరాజు, బిఆర్ఎస్ పార్టీ సినియర్ నాయకులు మకాం చంద్రమౌళి (CM), యువజన విభాగము పట్టణ అధ్యక్షులు పొట్ట మధు, కార్యదర్శి జమీర్ బాబా, బాలు, సంజీవ, నరేష్, అల్వాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## మాజీ మంత్రి హరీష్ రావుని కలిసిన మాజీ ఎమ్మెల్యే



**జయభేరి, దేవరకొండ :**

మాజీ మంత్రి, సిద్దిపేట శాసన సభ్యులు తన్నీరు హరీష్ రావు ని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట దేవరకొండ, పిఏపల్లి మండలాల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు TVN రెడ్డి, వెల్లుగురి వల్లపు రెడ్డి తదితరులు ఉన్నారు.



## వీర సావర్కర్ జయంతి ఘనంగా నిర్వహణ

■ GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి

**జయభేరి, ఎల్బీనగర్ :**

రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయంలో వీర సావర్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డితో కలిసి GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి సావర్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. “సావర్కర్ స్వాతంత్ర్య సమరయోధుడిగా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తీవ్రంగా పోరాడారు. ‘హిందుత్వ’ భావజాలానికి ఆద్యుడు ఆయనే. తన జీవితంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నప్పటికీ దేశభక్తిలో ఏమాత్రం వెనుకడుగు వేయలేదు” అని కొనియాడారు. దేశవ్యాప్తంగా ఈ రోజు ఆయన్ని స్మరించుకుంటూ అనేక కార్యాచరణలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొమ్మ రఘురాం నేత, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి నందికొండ గీతారెడ్డి, లయ, కిరణ్ కుమార్, నేరెంకి రవి, ప్రసన్న, అనిత, కవిత, పద్మ రెడ్డి, రాధిక, భారతి, గీత, సౌమ్య, మాధవి, విజయశ్రీ, తదితర మహిళా మోర్చా నాయకులు పాల్గొన్నారు.

## “హంగర్ ఫ్రీ వరల్డ్” కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తుంగతుర్తి రవి




**జయభేరి, మేడిపల్లి :**

ప్రతి సంవత్సరం మే 28న ప్రపంచ ఆకలి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ వారు CSR డేగా జరుపుకుంటూ, మేడిపల్లి బ్రాంచ్‌లో “హంగర్ ఫ్రీ వరల్డ్” కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. “ఒకరి ఆకలిని తీర్చడం అనేది కేవలం అన్నం పెట్టడం మాత్రమే కాదు, అది మనిషిలోని మానవతను చాటించే పని. మలబార్ గ్రూప్ చేపట్టిన ‘హంగర్ ఫ్రీ వరల్డ్’ కార్యక్రమం సామాజిక న్యాయాన్ని నిలబెట్టే ఒక శ్రేష్ఠమైన ప్రయత్నం. ప్రతి రోజు 60,000 మందికి ఉచిత భోజనం అందించడమంటే, అది మన దేశంలోని ఎన్నో పేద కుటుంబాలకి ఆదారంగా నిలుస్తోంది. ఈ సేవా కార్యక్రమం నన్ను ఎంతగానో స్ఫూర్తిపరిచింది అని, ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.” ఈ సందర్భంగా మలబార్ గ్రూప్ వారి 2025-26 సంవత్సరానికి గల ambititious CSR ప్రణాళికను ప్రకటించారు. ఈ ఏడాది 2.20 కోట్ల భోజనాలు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమం లో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ మేడిపల్లి వారి సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

## అభివృద్ధి, సమస్యల అంశాల పై జోనల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం

■ GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి



**జయభేరి, ఎల్బీనగర్ :**

కొత్తపేట్ ఎల్బీనగర్ జోన్, జోనల్ కమిషనర్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ IAS అధ్యక్షతన, జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి నేతృత్వంలో మొదటిసారిగా అధికారికంగా డివిజన్ల వారిగా నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి పాల్గొని డివిజన్ అభివృద్ధి, సమస్యల యొక్క అంశాలను లేవనెత్తారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లేవనెత్తిన అంశాలు : ఈస్ట్ జోన్ కు వివిధ రకాలైన ట్యాక్సులు, బిల్డింగుల అనుమతులు ద్వారా దాదాపు 700 కోట్లు వచ్చే ఆదాయాన్ని అట్టి డివిజన్ల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి మాత్రమే కేటాయించాలని పేర్కొన్నారు. మన్సూరాబాద్ డివిజన్, హయత్ నగర్ శివారు ప్రాంతమైన కాలనీల్లో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులు, మంచినీటి పైప్ లైన్లు తదుపరి వసతులు కల్పించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని మరియు కాలనీలల్లో పార్కు స్థలాలు కబ్జా కాకుండా చూడాలని తెలిపారు.

ప్రధానంగా మన్సూరాబాద్ పెద్ద చెరువు ప్రాంగణంలో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, వినాయక నిమజ్జన కొలను, 30 నుండి 40 కాలనీలకు మంచి ఆహ్లాదకరంగా ఉండే ప్రాంతంగా అభివృద్ధి చేయడం జరిగిందని అట్టి చెరువులో మురుగునీరు కలిసి పరిసర కాలనీలకు విపరీతమైన దుర్వాసన వస్తుందని శాశ్వతంగా మురుగు కలవకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. చిన్న చెరువులోకి వర్షపు నీరు వచ్చేదానికి దారులన్నీ మూతపడ్డాయని వెంటనే ప్రత్యేక ప్రణాళికలు చేపట్టి వర్షపు నీరు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని భూగర్భ జలాలు పెరిగే విధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ నిర్దిష్టమైన ప్రణాళికలతో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని మరియు వచ్చే వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల పై ప్రత్యేక దృష్టిసారించి ఎటువంటి సంఘటనలు ప్రత్యేక ప్రణాళికలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ జోన్ పరిధి 3 సర్కిల్లోని కార్పొరేటర్లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



# అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తాం

■ దేవరకొండ నియోజకవర్గంలో రానున్న మూడున్నరేళ్లలో 20 వేల ఇళ్లు కట్టించే బాధ్యత నాది- దేవరకొండ శాసనసభ్యులు బాలునాయక్ వెల్లడి

**జయభేరి, దేవరకొండ :**




దేవరకొండ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పదేళ్లలో ఒక్కరికి ఇండ్లు ఇవ్వలేదని, అలాంటిది తాము ఇచ్చిన వాగ్దానం ప్రకారం లబ్ధిదారులందరికీ, ముఖ్యంగా అత్యంత పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గానికి మూడు వేల ఐదు వందలు చొప్పున ఇండ్లు కట్టించి ఇస్తున్నామని, పేదల్లో అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని, రానివారు అధైర్య పడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రం పొందిన లబ్ధిదారులు 30 రోజులలో గృహాల నిర్మాణాన్ని ప్రారంభించాలని, లేనట్లయితే మంజూరు రద్దవుతాయని తెలిపారు. బేస్మెంట్ వరకు వచ్చిన తక్షణమే లక్ష రూపాయలు లబ్ధిదారుల ఖాతాలో వేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఇల్లు పూర్తయ్యేలోపు దశలవారీగా ఐదు లక్షల రూపాయలను లబ్ధిదారుల ఖాతాలో వేయడం జరుగుతుందని ,లబ్ధిదారులు అర్థాటాలకు వెళ్లకుండా ప్రభుత్వం నిర్దేశించిన 400 నుండి 600 చదరపు అడుగుల లో ఇల్లు నిర్మించుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మండల స్థాయిలో ఇసుక కమిటీ వేయడం జరుగుతుందని ,లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అర్హతలు లేని వారు ఉండరాదని, ఒకవేళ అలాంటి వారు ఉంటే చర్యలు తీసుకుంటామని, ఇండ్లు రాకుండా మిగిలిపోయిన వారు నిరాశ పడాల్సిన అవసరం లేదని, దశలవారీగా వీరికి కూడా ఇద్దరమ్మ ఇండ్లు ఇస్తామన్నారు .గతంలో దేవరకొండ పట్టణంలో ఇల్లు నిర్మించుకుని రెగ్యులరైజేషన్ కానీ వారికి రెగ్యులరైజ్ చేయాలని, గ్రామ కంఠం, వక్ఫ్ భూములలో ఇల్లు నిర్మించుకున్న వారందరికీ హక్కు పత్రాలు కల్పించాలని ఆయన జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. మధ్యలో మిగిలిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను సైతం చేపట్టి పూర్తి చేస్తామని శాసన సభ్యులు తెలిపారు.

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాను పారదర్శకంగా, శాస్త్రీయపద్ధతిలో ,నియమ నిబంధనలకు అనుగుణంగా రూపొందించడం జరిగిందని తెలిపారు . మొదటి విడతన ఇల్లు రాని వారు కంగారు పడాల్సిన అవసరం లేదని మొదటి విడతలో ఇల్లు కట్టుకునేందుకు జాగా ఉన్న వారికి మాత్రమే మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. లబ్ధిదారులు మంజూరు పత్రం పొందిన 30 రోజుల్లో ఇంటి నిర్మించుకోవాలని, లేనట్లయితే రద్దు చేయవలసి వస్తుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను ఉచితంగా ప్రభుత్వమే ఇస్తుందని, ఇందుకు ఆర్ డి ఓ, తహసిల్దార్ ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాపీని చూపించవలసి ఉంటుందని, ఇసుక కొరత ఉత్పన్నం కాకుండా ఇసుకను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. దీంతోపాటు ప్రతి మండలంలో ధరల నియంత్రణ కమిటీని ఏర్పాటు చేస్తామని, స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు, తాహసిల్దార్, ఇంజనీరింగ్ అధికారులు కమిటీలో సభ్యులుగా ఉంటారని, ఈ కమిటీ ఇందిరమ్మ ఇండ్లకు వాడే సామాగ్రి ధరలు నియంత్రిస్తుందని తెలిపారు. దేవరకొండ నియోజకవర్గం లో 2346 మంజూరు ఉత్తర్వులను బుధవారం ఇస్తున్నట్లు ఆమె వెల్లడించారు. అంతకుముందు జిల్లా గృహనిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, విధివిధానాలు, తదితర అంశాలను వెల్లడించారు. దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ప్రజా ప్రతినిధులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్ లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులను పంపిణీ చేశారు.

## తెలంగాణ రాష్ట్రసాధనలో జర్నలిస్టు ఫోరం పాత్ర చారిత్రాత్మకం

■ టీజేఎఫ్ 25 వసంతాల రాజతోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**



తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు నినాదంతో తెలంగాణ జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 31 న హైదరాబాద్ లోని జల విహార్ లో నిర్వహిస్తున్న 25 వసంతాల రజతోత్సవాల సంబురాల పోస్టర్లను, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(TUWJ)143 మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బొమ్మ అమరేందర్, జిల్లా ఉపాధ్యక్షులు బాలరాజ్ కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గోపాల్ గౌడ్, ఆధ్వర్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధన కోసం జర్నలిస్టులు పిడికిలి బిగించి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ నాయకత్వంలో రజతోత్సవ సంబరాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా టీయూడబ్ల్యూజే యూనియన్ నాయకులు కాప్రా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి దొమ్మాటి కిరణ్ కుమార్, సత్యనారాయణ, రాజేష్, రాము, శ్రీకాంత్, నరేష్, కృష్ణ, శ్రీను, సురేష్, నాగేంద్రబాబు, మాజీ కృష్ణంరాజు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరానికి హాజరైన తుంగతుర్తి

**జయభేరి, మేడిపల్లి :**



కచవాని సింగారం గ్రామపంచాయతీలో రక్తదాన శిబిరం, అవయవదాన శిబిరం ఘనంగా నిర్వహించబడింది. ఈ శిబిరం రెడ్ క్రాస్ సంస్థ సహకారంతో, హైదరాబాద్ యూత్ అసెంబ్లీ ఆధ్వర్యంలో, యువతలో సేవా స్ఫూర్తిని పెంపొందించడంకోసం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా పీర్జాదిగూడ అధ్యక్షులు తుంగతుర్తి రవి గారు హాజరై, తమ ప్రేరణతో కార్యక్రమానికి మరింత గొప్పతనాన్ని చేకూర్చారు. తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. "సమాజానికి మనం ఇచ్చే ఉత్తమమైన కానుక రక్తదానం, అవయవదానం. ఇవి కొత్త జీవాన్ని ప్రసాదించగల శక్తివంతమైన చర్యలు. మన సన్నిహితులు గానీ, తెలియని వారు గానీ ఓ ప్రమాదంలో ప్రాణాలతో పోరాడుతున్నప్పుడు.. మన ఇచ్చిన రక్తం లేదా అవయవం వారి జీవితాన్ని నిలుపుతుంది. ఇది కేవలం దానం కాదు.. ఇది ఓ జీవితం పునరుత్థానం. యువతలో సేవా స్ఫూర్తిని నింపడమే ఈ కార్యక్రమాల ఉద్దేశ్యం. మీరు అందరూ స్వచ్ఛందంగా ముందుకు రావడం చూస్తే గర్వంగా ఉంది. మన గ్రామం ఇలా మానవతా విలువలకు మారుపేరు కావాలి. రెడ్ క్రాస్ సంస్థతో కలిసి ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు నిర్వహించే బాధ్యత మనందరిదీ. ఒకరికి చేసిన సహాయం వందల మందికి మార్గదర్శకంగా మారుతుంది."




ఈ సందర్భంగా ఆయన రెడ్ క్రాస్ బృందానికి, హైదరాబాద్ యూత్ అసెంబ్లీ ఆర్గనైజేషన్ కు, గ్రామపంచాయతీకి, గ్రామ యువతకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. రక్తదానం అనేది ప్రాణదానమే అన్న నినాదంతో యువతీయువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తాన్ని దానం చేయడం గర్వకారణంగా నిలిచింది. అలాగే అవయవ దానంపై ప్రజల్లో అవగాహన పెంచే విధంగా అధికారులు, వైద్య సిబ్బంది ప్రసంగించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమం గ్రామస్థులు మరియు యువత నుండి విశేష స్పందన పొందింది. రెడ్ క్రాస్ బృందం, హైదరాబాద్ యూత్ అసెంబ్లీ ఆర్గనైజేషన్ సభ్యులు,గ్రామపంచాయతీ సభ్యులు, మరియు స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## దట్టమైన అడవుల్లో మిస్సైన దంపతులు

**జయభేరి, అస్సాం మే 28:**

మే 11న వారి పెళ్లి అంగరంగ వైభవంగా వారి పెళ్లి జరిగింది. కొత్తగా పెళ్లైన జంట కదా.. హనీమూన్‌కి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అంతా ప్లాన్ చేసుకొని ఈ నెల 20న తమ ఇంటి నంచి బయల్దేరి షిల్లాంగ్ వెళ్లారు. అస్సోం రాజధాని గౌహటీ మీదుగా షిల్లాంగ్ చేరుకున్నారు. అయితే షిల్లాంగ్ వెళ్లే ముందు గౌహటిలోని ప్రముఖ కామాఖ్యా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత దట్టమైన అడవుల్లోకి వెళ్లి.. కనిపించకుండా పోయారని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారుపూర్తి వివరాల్లోకి వెళ్తే.. రాజా, సోనమ్ అనే దంపతులు గువహటి మీదుగా షిల్లాంగ్‌కు ప్రయాణించి, దాదాపు 60 కి.మీ దూరంలో ఉన్న సోహ్రా (చిరాపుంజి) సందర్శించడానికి యాక్టివా స్కూటీని అద్దెకు తీసుకున్నారు. దట్టమైన అడవుల గుండా ప్రయాణిస్తూ ముందుకు సాగారు. మరుసటి రోజు సోహ్రారిమ్ అనే గ్రామ సమీపంలో నవ దంపతుల యాక్టివా పడి ఉంది.



## 16 ఏళ్ల బాలికను పెళ్లి చేసుకున్న 42 ఏళ్ల వ్యక్తి

**జయభేరి, అనంతపురం, మే 28:**

అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం లో 42 ఏళ్ళ వయసున్న ఓ వ్యక్తి 16 ఏళ్ల యువతిని బలవంతంగా పెళ్లి చేసుకున్నాడు. ఇష్టం లేని ఆ బాలిక తప్పించుకొని పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగు చూసింది.కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్న దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు వివాహం చేయగా భర్త చనిపోయి పుట్టింట్లో ఉంటుంది. రెండో కుమార్తె మైనర్. వీరి కుటుంబం ఆర్థిక స్థితిగతులు ఆసరాగా చేసుకున్న గుమ్మగట్ట మండలం పూలకుంట గ్రామానికి చెందిన వడ్డే రామాంజనేయులు ఆ బాలికను రెండో వివాహం చేసుకున్నాడు. అతని భార్య రెండేళ్ల కిందటే మృతి చెందింది. అతనికి వివాహమైన ఓ కుమారుడు, పెళ్లి కావాల్సిన ఓ కుమార్తె ఉన్నారు. రెండో వివాహం ఏప్రిల్ 16వ తేదీన పెళ్లి చేసుకున్నాడు.పెళ్లి ఇష్టం లేని బాలిక వారం రోజుల్లోనే పుట్టింటికి చేరింది. మే 24న రామాంజనేయులు తన బంధువులతో బాలిక ఇంటికి వెళ్లి ఆమె తల్లి, తండ్రి, సోదరిపై దాడి చేసి బాలికను తీసుకెళ్లారు. రెండు రోజుల పాటు ఇష్టారాజ్యంగా కొట్టడంతో దెబ్బలు భరించలేని ఆ బాలిక ఆదివారం రాత్రి తప్పించుకుని ఇంటి నుంచి బయటకు వచ్చింది. అర్ధరాత్రి ఒంటరిగా పొలాల వెంబడి నడుచుకుంటూ వచ్చి ఓ చోట నిద్రించింది. సోమవారం ఉదయం స్థానికుల సహాయంతో అనంతపురం జిల్లా ఎస్పీ కార్యాలయం చేరుకుని తనకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసింది. అధికారుల కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఉదయం బాలిక, తల్లి సోదరి రాయదుర్గం పోలీస్ స్టేషన్ కు చేరుకున్నారు. పోలీసులు నిందితుడు రామాంజనేయులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ విషయమై రామాంజనేయులు కుటుంబ సభ్యులు బంధువులు మాత్రం ఇది తప్పుడు కేసు అని చెబుతున్నారు. బాలిక మైనర్ కాదని, ఆమెకు 18 సంవత్సరాల ఐదు నెలలు ఉన్నాయని, రామాంజనేయులు వయసు 42 సంవత్సరాలు అని తెలిపారు. మొదటి భార్య చనిపోవడంతో ఆయన బంధువుల అమ్మాయి కావడంతో యువతిని రెండో వివాహం చేసుకున్నాడని చెప్పారు. బాలిక తల్లిదండ్రులు, అమ్మాయి అంగీకారంతోనే కుటుంబ సభ్యులు బంధువులు, వారి కులస్తుల అంగీకారంతో రెండవ వివాహం ఘనంగా జరిపించారని వెల్లడించారు. పెద్దల సమక్షలో మూడు రోజులపాటు పెళ్లి వేడుకలు నిర్వహించామని రామాంజనేయులు తరపు వారు తెలిపారు. అమ్మాయికి రూ. 2 లక్షల రూపాయలు డబ్బులు, ఒక తులం బంగారు నగలు సమర్పించి అందరి సమక్షంలో వివాహం జరిపించామన్నారు. వివాహం అయిన తర్వాత ఆ యువతి భర్త ఇంటికి కాపురానికి రాకపోవడంతో తాము తీసుకెళ్లామని, బలవంతంగా తీసుకెళ్ల లేదని తెలిపారు. అమ్మాయి మేజర్ అని, ఆమెకు 18 ఏళ్లకు పైగా వయసు ఉందని ఆధార్ కార్డ్ చూపించిన తరువాతే పెళ్లి జరిపించినట్లు నిందితుడి కుటుంబం తెలిపింది. బాలిక ఫిర్యాదుతో రాయదుర్గం పోలీసులు నిందితుడు రామాంజనేయులపై ఫోక్సో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. విచారణలో అసలు నిజాలు బయటకు రానున్నాయి.



# రూ. 20 కోట్ల పారితోషికం..

**SSMB29 ప్రాజెక్ట్‌ను రిజెక్ట్ చేసిన నానా పటేకర్.!**

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో ఒక మూవీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. SSMB29 అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌లో ప్రియాంక చోప్రా జోనాస్, కథానాయికగా నటిస్తుండగా.. మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. అయితే ఈ ప్రాజెక్ట్ కోసం బాలీవుడ్ లెజెండరీ యాక్టర్ నానా పటేకర్‌ని సంప్రదించగా.. ఆయన ఆ ఆఫర్‌ను తిరస్కరించినట్లు వార్తలు వస్తున్నాయి. సుమారు రూ. 20 కోట్ల పారితోషికాన్ని 15 రోజుల షూటింగ్ కోసం ఆఫర్ చేసినప్పటికీ, నానా పటేకర్ ఈ పాత్రకు నో చెప్పినట్లు సమాచారం. బాలీవుడ్ నివేదికల ప్రకారం, రాజమౌళి స్వయంగా పూణేలోని నానా పటేకర్ ఫామ్‌హౌస్‌కు వెళ్లి స్క్రిప్ట్‌ను వివరించినట్లు తెలుస్తోంది. రాజమౌళి కథ చెప్పిన విధానం, ప్రాజెక్ట్‌పై ఆయనకున్న అంకితభావం పట్ల నానా పటేకర్ ప్రశంసలు కురిపించినప్పటికీ, ఆ పాత్ర తనకు ఆకర్షణీయంగా అనిపించలేదని, తాను కోరుకునే లోతు ఆ పాత్రలో లేదని ఆయన భావించినట్లు వార్తలు చెబుతున్నాయి. ఈ వార్తలపై నానా పటేకర్ నేరుగా స్పందిస్తూ, తాను ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం లేదని స్పష్టం చేశారు. అయితే, భవిష్యత్తులో రాజమౌళితో కలిసి పనిచేయడానికి తాను ఆసక్తిగా ఉన్నానని ఆయన చెప్పినట్లు తెలుస్తోంది. 'SSMB29' సినిమా ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. ఈ సినిమా 2027లో విడుదల కానుంది.

# ఇది ప్రతి ఇంట్లో జరిగే కథ



'నటుడిగా నాకు సంతృప్తినిచ్చిన సినిమాల్లో 'షష్టిపూర్తి' ఒకటి. ఇది ప్రతి ఇంట్లో జరిగే కథ. అందుకే ప్రతి ఒక్కరికీ ఈ సినిమా కనెక్ట్ అవుతుంది.' అని డా.రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'షష్టిపూర్తి'. అర్చన, రూపేష్, ఆకాంక్ష సింగ్ ప్రధాన పాత్రధారులు. పవన్‌ప్రభ దర్శకుడు. రూపేశ్ నిర్మాత. రేపు సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. 'మనం ఏ పాత్ర పోషించినా ఆ పాత్రే గుర్తుండాలనేది నా సూత్రం. ఇది నా అయిదో జనరేషన్. ఇప్పటికీ నాకోసం 'షష్టిపూర్తి' లాంటి పాత్రలు రాస్తున్నారంటే అది నా అదృష్టం. తల్లిదండ్రుల పెళ్లిని పిల్లలు చూడలేరు. అందుకే అమ్మనాన్నలకు 'షష్టిపూర్తి' చేసి వారి కోరిక తీర్చుకుంటారు. ఇది ఓ గొప్ప సాంప్రదాయం. ఈ నేపథ్యంలో వచ్చే కథల్నీ, పాత్రల్నీ అస్సలు మిస్సవ్వకూడదనే ఈ సినిమాలో నటించాను. కళాకారుడికి ఆకలి, దాహం తీరదు. ఎన్ని గొప్పపాత్రలు చేసినా ఇంకా కావాలని కోరుకుంటాడు. నేనూ అంతే. ఇందులో అద్భుతమైన పాత్ర దొరికింది. మంచి సహనటులు, ఇళయరాజా సంగీతం, చక్కని కథ ఇంతకు మించి ఇంకేం కావాలి. 'షష్టిపూర్తి' తప్పకుండా అన్ని వర్గాల ప్రేక్షకులకూ నచ్చుతుంది.' అని నమ్మకం వ్యక్తం చేశారు రాజేంద్రప్రసాద్.

# ఆకాశాన్ని ఎంతకని వెలకడతారు ?

రాబిన్‌హుడ్ తరహా పాత్రలో పవన్‌కల్యాణ్ నటించిన ప్రతిష్టాత్మక పానిండియా జానపద చిత్రం 'హరి హర వీరమల్లు'. నిధి అగర్వాల్ కథానాయిక. జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఎ.దయాకర్‌రావు నిర్మించిన ఈ చిత్రం జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఇప్పటికే ఈ సినిమాలోని మూడు పాటల్ని మేకర్స్ విడుదల చేయగా, చెన్నైలో ఘనంగా నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో సినిమాలోని నాలుగో గీతాన్ని విడుదల చేశారు. కథానాయిక నిధి అగర్వాల్, సమర్పకుడు ఏ.ఎం.రత్నం, దర్శకుడు జ్యోతికృష్ణ, నటులు సత్యరాజ్, నాజర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సినిమా విజయం పట్ల వారంతా నమ్మకం వెలిబుచ్చారు. ఇక పాట విషయానికొస్తే.. 'తార తార నా కళ్లు.. వెన్నెల పూత నా ఒళ్లు.. ఆకాశాన్ని ఎంతకనీ వెలకడతారు.' అంటూ సాగిన ఈ గీతాన్ని శ్రీహర్ష రాయగా, ఎం.ఎం.కీరవాణి స్వరపరిచారు. లిప్సిక భాష్యం, ఆదిత్య అయ్యంగార్ ఆలపించారు. పవన్‌కల్యాణ్, నిధి అగర్వాల్‌పై చిత్రీకరించిన ఈ పాట ప్రేక్షకులకి కొత్త అనుభూతిని కలిగించేలా ఉంది. రాజుల కాలంనాటి వాతావరణాన్ని ఈ పాటలో అద్భుతంగా ఆవిష్కరించారు.





# ఆ భాద మీకేం తెలుసు..

ఒకానొక సమయంలో టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా రాణించింది ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్. ఈ అమ్మడి గురించి తెలుగు ప్రజలకు ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.. తన అందంతో, నటనతో తెలుగు ప్రజలను కట్టిపడేసింది ఈ చిన్నది. 18 ఏళ్ల వయసులో కాలేజీలో చదువుతున్నప్పుడే మోడలింగ్‌లో కెరీర్ ప్రారంభించి 2009లో కన్నడ చిత్రం 'గిల్లి'తో తన హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించింది. ఆ తరువాత 2011 కెరటంలో సిద్ధార్థ్ రాజ్‌కుమార్ సరసన నటించింది. ఆ తరువాత తెలుగులో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమాతో భారీ పాపులారిటీ అందుకున్న రకుల్ ప్రీత్ సింగ్, ఆ తర్వాత చాలామంది స్టార్ హీరోల సరసన నటించి మెప్పించింది. ఇదిలా ఉంటే గత ఏడాది ఫిబ్రవరిలో ప్రముఖ బాలీవుడ్ నటుడు నిర్మాత అయిన జాకీ భగ్నానీ నీ ప్రేమించి మరీ వివాహం చేసుకుంది. పెళ్లి తర్వాత కూడా ఈ అమ్మడు సినిమాలు చేస్తూ పేక్షకులను ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం రకుల్ హిందీ సినిమాల పైనే ఎక్కువ ఫోకస్ పెట్టింది. గతంలో రకుల్ ప్రెగ్నెంట్ అంటూ సోషల్ మీడియాలో కొన్ని రూమర్స్ వచ్చాయి. తాజాగా రకుల్ ప్రెగ్నెన్సీ గురించి మాట్లాడుతూ.. ప్రెగ్నెన్సీ ప్లాన్ చేయకుండానే అనుకోకుండా గర్భం వచ్చినప్పుడు చాలామంది సులభంగా అబార్షన్ చేయించుకో అని సలహాలు ఇస్తూ ఉంటారు. కానీ ఆ బాధ ఎలా ఉంటుందో అనుభవించే వారికి మాత్రమే తెలుస్తుంది అని అంది.. అబార్షన్ అంటే మనలోని ఓ జీవాన్ని చంపేయడమే.. ఈ విషయాన్ని ప్రతి ఒక్క భర్త అర్థం చేసుకోవాలి.. అబార్షన్ అంటే భార్యల పై ఒత్తిడి తీసుకురాకూడదు అని ఎమోషనల్ గా చెప్పుకొచ్చింది రకుల్.

# హరి హర వీరమల్లు నుండి నిధి సాంగ్ విడుదల..




పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో రూపొందిన పీరియడ్ యాక్షన్ డ్రామా 'హరి హర వీర మల్లు చిత్రం జూన్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. జ్యోతి కృష్ణ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తుంది. చిత్ర రిలీజ్ దగ్గర పడుతుండడంతో మేకర్స్ ప్రమోషన్ స్పీడ్ పెంచారు. ఈ క్రమంలో సినిమాలోని నాలగవ సింగల్ ని విడుదల చేశారు.. 'తార తార నా కళ్లు..' అంటూ సాగే ఈ పాట ఎంతగానో ఆకట్టుకుంటుంది.. ముఖ్యంగా నిధి తన అందాలతో అదరగొట్టేసింది. శ్రీ హర్ష లిరిక్స్ అందించగా లిప్సిక, ఆదిత్య పాడారు. ఎంఎం కీరవాణి సంగీతాన్ని అందించారు.ఇక చిత్రం నుండి ఇప్పటికే విడుదలైన 'మాట వినాలి', 'కొల్లగొట్టినాదిరో', పవర్ ఫుల్ 'అసుర హననం' సాంగ్స్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది.
మూవీలో అనుపమ్ ఖేర్, సుబ్బరాజు, సునీల్, నాజర్, విక్రమ్‌జీత్ విర్క్, నోరా ఫతేహి, నర్గీస్ ఫక్రీ మరియు ఇతరులు కీలక పాత్రలు పోషిస్తారు. ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. జ్యోతికృష్ణ తెరకెక్కించిన ఈ బిగ్గీని ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్నారు. ఈ మూవీ ఎప్పుడో విడుదల కావలసి ఉన్నా కూడా పలు కారణాల వలన వాయిదా పడుతూ వచ్చింది. ఇప్పటి వరకు మూవీ పదిసార్లు వాయిదా పడింది. ఎట్టకేలకి జూన్ 12న విడుదల కానుంది. ఇక మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్స్ భారీ ఎత్తునే ప్లాన్ చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ముంబైలోను ఈవెంట్ ప్లాన్ చేసినట్టుగా తెలుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.
'డాకు మహారాజ్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన బాబి డియోల్, ఈ చిత్రంలో ఔరంగజేబు పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. హరిహర వీరమల్లు' పవన్ కళ్యాణ్ తొలి పాన్ ఇండియా చిత్రం కావడంతో మూవీపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇందులో ఆయన దొరలను దోచి పేదలకు న్యాయం చేసే రాబిన్ హుడ్ తరహా పాత్రలో కనిపించనున్నట్టు టాక్ వినిపిస్తుంది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com